# రిమార్క్

విత్తనాల కోసం అగ్రికల్చరల్ ఆఫీసుకి వచ్చి సంబంధిత గుమస్తాను కలిశాడు రంగయ్య.

"దరఖాస్తు రాయించుకురా పైకి పంపిస్తాను" అన్నాడు జూనియర్ అసిస్టెంట్ జగన్నాథం.

సరేనని చెప్పి దరఖాస్తు రాయించుకుని వచ్చాడు రంగయ్య. వెంటనే జగన్నాథం దానిమీద నోట్ రాసి ఫైలు ఎడిగారికి పంపిస్తూ "పదిహేనురోజుల తర్వాత కనిపించు" అన్నాడు.

తొందరగా పని జరిగినందుకు ఎంతగానో సంతోషినిచాడు రంగయ్య.

వారంరోజుల తర్వాత ఆసిస్టెంట్ డైరెక్టర్ దానిమీద రిమార్కు రాసి ఫైల్ మీద రిమార్కు రాసి ఫైల్ జగన్నాథానికి పంపించారు.


ఎడిగారు రాసిందేమిటో బోధపడలేదు జగన్నాథానికి.

ఏం చెయ్యాలో తెలియక తిన్నగా సూపరింటెండెంట్‌గారి వద్దకెళ్ళి ఫైలు చూపించి ఆయన రాసిన రిమార్కు ఏమిటో చదివి చెప్పమన్నాడు.

సూపరింటెండెండ్ సత్యారావు దానిని ఒకటికి పదిసార్లు పరిశీలించి పెదవి విరుస్తూ.

"ఏమోనయ్యా అతగాడేం రాశాడో నాకు కూడా అర్ధంకావడం లేదు. మేనేజర్‌గారికి చూపించు" అంటూ సలహా ఇచ్చాడు.

వెంటనే మేనేజర్ గారిని కలిశాడు జగన్నాథం.



"టైపిస్టు తాతారావు రకరకాల హ్యాండ్ రైటింగ్‌లు చూసి టైప్ చేస్తుంటాడు తెలిస్తే అతడికేమైనా తెలియాలి" అన్నాడు మేనేజర్.

ఉస్సూరుమంటూ టైపిస్ట్ తాతారావుని కలిశాడు జగన్నాథం.

"సారీ గురూగారూ! ఆయన ఏం రాశారో నాకూ అర్ధంకావడం లేదు, అక్షరాలు మరీ గజిబిజిగా ఉన్నాయి. పోనీ మీరో పనిచెయ్యకూడదూ?" అంటూ జగన్నాథం వంక తేరిపార చూశాడు తాతారావు

'సస్పెన్స్ పెట్టి చంపక చెప్పేదేదో తొందరగా చెప్పి తగలడు' అన్నట్లు ఇబ్బందిగా ముఖం పెట్టాడు జగన్నాథం.

"డైరెక్టుగా ఎడి గారినే కలిసి ఆయన రాసిందేమిటో కనుక్కుంటే పోలా!" అన్నాడు తాతారావు.

ఆ మాత్రానికి ఇంత బిల్డప్ దేనికో అనుకుని తిన్నగా అసిస్టెంట్ డైరెక్టర్ గారి వద్దకు వెళ్లి "అయ్యా! ఈ ఫైల్ మీద తమరు రాసిన రిమార్కు నాకు అర్థం కావడం లేదు. ఏం చెయ్యాలో తెలీక మీవద్దకొచ్చాను. దయచేసి ఏం రాశారో చదివి చెబితే..."

అంటూ వినయంగా ఫైల్ అతడి ముందు పరిచాడు.

"ఏం లేదయ్యా! నీహ్యాండ్‌రైటింగ్ ఏమీ బాగాలేదని ఫైల్ తిరిగి రాయమన్నానంతే" అన్నారు ఎడిగారు నవ్వుతూ.

అవాక్కైయ్యాడు జగన్నాథం.

**(జూన్ 2007 ఆంధ్రభూమి మంత్లీ)**